అధ్వానం

- గుంతలమయంగా కారెంపూడి - దాచేపల్లి ఆర్అండ్‌బీ రహదారి
- 20కిలోమీటర్ల రోడ్డులో.. 4 కిలోమీటర్లు మరింత దారుణం
- ఎన్నికల కోడ్‌తో గతంలో నిలిచిన అభివృద్ధి పనులు
- పునఃప్రారంభంలో తీవ్ర జాప్యం


మూల మలుపు వద్ద అధ్వానంగా కారెంపూడి - దాచేపల్లి రహదారి

కారెంపూడి: ఇది పేరుకే ఆర్అండ్‌బీ రహదారి. వాహనం స్పీడు 15 కిలోమీటర్లు దాటితే ఏదో ఒక గుంతలో పడాల్సిందే. అంతలా దారుణంగా తయారైంది కారెంపూడి – దాచేపల్లి రహదారి. వినుకొండ ప్రాంతంతో పాటు కారెంపూడి, దుర్గి, జూలకల్లు ప్రాంతం వైపు వారు హైవే చేరాలంటే ఇదే మార్గం. అలాగే రోడ్డు వెంబడి ఉన్న 16 గ్రామాల ప్రజలతో పాటు కారెంపూడి నుంచి దాచేపల్లికి ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యమున్న ఈ 20 కిలోమీటర్ల రహదారిలో నాలుగు కిలోమీటర్ల రోడ్డు పూర్తి ధ్వంసమైంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించలేక వాహనదారులు గోగుల పాడు అడ్డదారి నుంచి దాచేపల్లి వెళ్తున్నారు. ఇనుపరాజు పల్లె ముందు నుంచి గుంతలతో నిండిపోయింది. కాచవరం దాటి దాచేపల్లి మండలం తక్కెళ్లపాడు వరకు ఈ గుంతల్లోనే వాహనాలు ప్రయాణించాలి ఈ నాలుగు కిలోమీటర్ల ప్రయాణం నరకప్రాయంగా మారింది. చాలా కాలంగా రోడ్డు సమస్య వేధిస్తున్నా.. సమస్యను గుర్తించి అధికారులు పరిష్కరించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల కోడ్‌తో ఆటంకం..

గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు పునర్నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు


పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

పిలిచి, వర్క్‌ను కూడా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మండలంలో నరమాలపాడు నుంచి కారెంపూడి వరకున్న ఆర్అండ్‌బీ రోడ్డును ఆ కాంట్రాక్టరే పునర్నిర్మాణం చేశారు. ఆ పని అయిపోయి ఈ రోడ్డు పనులు చేపడతారనకున్న సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత చేసిన పనులకే డబ్బులు రాకపోవడంతో.. కాంట్రాక్టర్ పనులు నిలిపివేసట్లు సమాచారం. అనంతరం మాచర్లకు చెందిన వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారని ఆర్అండ్‌బీ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు.

ఎమ్మెల్యే దృష్టి సారించాలి

రోడ్డు మరమ్మతులను అధికారులు పట్టించుకోవడం లేదు. ఎన్నికలు అయ్యాక రోడ్డు వేస్తామన్నారు. ఇప్పటికీ అతీగతి లేదు. ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారు. ఇనుపరాజుపల్లె వద్ద ఎక్కువ గుంతలున్నాయి. స్థానిక ఎమ్మెల్యే శ్రద్ధతీసుకుని రోడ్డు వేసేలా చూడాలి.

– ఆకుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్, ఇనుపరాజుపల్లె

జాప్యం వద్దు

రోడ్డంతా గుంతల మయమైంది. ఇనుపరాజు పల్లె నుంచి కాచవరం దాటే వరకు రోడ్డు బాగా పాడైపోయింది. పెద్ద గుంతలు పడ్డాయి. బస్సులో ఎక్కినా కుదుపులు తప్పడం లేదు. వేసవిలోనే రోడ్డు వేయాలి. మళ్లీ వర్షాకాలం వస్తే గుంతలు ఇంకా పెద్దవయ్యి రోడ్డు రూపురేఖలు లేకుండా పోతుంది.

– తగరం శేఖర్, ఎస్సీ కాలనీ, ఇనుపరాజుపల్లె

ముందు గుంతలన్నా పూడ్చండి

కనీసం ఇనుపరాజుపల్లె గ్రామం నుంచి తక్కెళ్లపాడు వరకు రోడ్డు గుంతలు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డు కిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని అభ్యర్థిస్తున్నారు. తర్వాత గుంతలను వెట్ మిక్స్‌తో నింపి, చదును చేయాలని కోరుతున్నారు. వాస్తవంగా వర్క్ కండిషన్ కూడా అదే. ఈ పని అయ్యాక 20 కిలోమీటర్లు మొత్తం బీటీ లేయర్ వేయాల్సి ఉంది.

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షల తనిఖీ



పిడుగురాళ్ల: ఇంటర్మీడియెట్ మొదటి పరీక్షలను శనివారం డీఈసీ సభ్యులు తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జువాలజీ, హిస్టరీ, మ్యాథ్స్ సబ్జెక్ట్‌ల పరీక్షలను డీఈసీ స్పెషల్ ఆఫీసర్ వేణు, డీఈసీ– 3 సభ్యుడు నరసయ్య పరిశీలించారు. ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాలనూ తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 227, ఆక్స్ ఫర్డ్ కాలేజీలో 470, స్కాలర్స్ కాలేజీలో 248, నారాయణ కాలేజీలో 309 మంది పరీక్షలకు హాజరయ్యారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

రెంటచింతల: స్థానిక శివాలయంలోని కల్యాణ మండపంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉచిత కంటి శుక్లముల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గుండా జనార్దన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు రేషన్, ఓటర్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డుల జిరాక్స్‌లతో మొబైల్ ఫోన్‌ను వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం ఉంటుందని, పూర్తి వివరాలకు 98660 25589 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ

మాచవరం: మండలంలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ అందిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి, 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులని పేర్కొన్నారు. 45 రోజుల కోర్సు రోజుకి 8 గంటలు, 60 రోజుల కోర్సు రోజుకి 6 గంటలు, 90 రోజుల కోర్సు రోజుకి 4 గంటల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున మండల పరిధిలోని మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 111 కేసుల పరిష్కారం



చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 111 కేసులు పరిష్కరించారు. రూ.11,01,75,564 పరిహారంగా చెల్లించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.నరేందర్ రెడ్డి పాల్గొని అదాలత్‌లో 53 క్రిమినల్ కేసులు, 11 చెక్కు బౌన్స్ కేసులు, 5 భరణం కేసులు, 5 డీవీసీ, 10 సివిల్, 14 ఎక్సైజ్, 12 ప్రీ–లిటిగేషన్ కేసులు పరిష్కరించారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

నాదెండ్ల: గణపవరం జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి వద్ద రూ.15 లక్షలతో నిర్మించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖద్వారంతో పాటూ దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు కెల్లంపల్లి అచ్చయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వ్యాపారవేత్త పేర్ని వీరనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు కంచర్ల శ్రీనివాసరావు, కాట్రు శ్రీనివాసరావు, కాట్రు కృష్ణారావు, శివరామకృష్ణ, నన్నపనేని శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు



చిలకలూరిపేట: పాలిథిన్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పాలిథిన్ కవర్ల వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి పట్టణంలో పాలిథిన్ కవర్ల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపారు. వీటికి బదులుగా ప్రజలు గుడ్డ సంచులు, జనపనార సంచులు ఉపయోగించాలని సూచించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా, విక్రయించినా రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించబడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్‌వీ రమణరావు, సీహెచ్ సునీత పాల్గొన్నారు.

భూముల సమస్యను పరిష్కరించండి



కారెంపూడి: ఎంతో కాలంగా తాము సాగు చేసుకుంటున్న భూములు ప్రభుత్వ భూములని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తున్నారని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పేటసన్నెగండ్ల గ్రామ రైతులు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు శనివారం వినతిపత్రం అందించారు. పేటసన్నెగండ్ల గ్రామంలో మొత్తం 800 ఎకరాలు దాకా భూమిని దశాబ్దాలుగా సాగు చేసుకుని జీవిస్తున్నామని గ్రామ రైతులు తెలిపారు. ఆ భూములు లేకుంటే తమకు జీవనాధారం కోల్పోతామని విన్నవించారు. కలెక్టర్‌కు నివేదించిన అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలకు రైతులు వినతిపత్రాలందించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రేపు యథావిధిగా ప్రజా వేదిక

గురజాల : ప్రజా సమస్యల ప్రజా వేదిక కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని తహసీల్దార్ కె.నగేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజావేదిక నిలుపుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలు అర్జీలు సమర్పించాలని తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

- సేవలందించిన మహిళలకు సన్మానాలు
- ఆటల పోటీల విజేతలకు బహుమతులు

మాచర్ల: పట్టణంలో పలు ప్రాంతాల్లో మహిళ దినోత్సవాలను శనివారం ఘనంగా జరిగాయి. పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మెప్మా ప్రాజెక్టు అధికారి శ్యామలాదేవి, సీఓలు అజలి, రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు ఘనంగా సన్మానించారు.

■ పదో వార్డులో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను పాల్గొని, మదర్‌థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

■ అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో రోటరీ క్లబ్‌అధ్యక్షురాలు కృష్ణకుమారి పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన మహిళలను ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ సురేఖ, అన్నపురెడ్డి లక్ష్మీ, లయన్స్ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ చుండూరి వెంకటేశ్వర్లు, కళాశాల డైరెక్టర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

■ బీజేపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్, జిల్లా నాయకులు బొగ్గవరపు మస్తాన్‌రావు, పి.కాశిపతి వివిధ రంగాల్లో ప్రతిభ కబర్చిన ఇద్దరు మహిళలను సత్కరించారు. బీజేపీ నాయకులు సురేష్, బి.రాంబాబు పాల్గొన్నారు.



కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మహిళా దినోత్సవం


కార్డ్స్ పాఠశాలలో మహిళా దినోత్సవం

పిడుగురాళ్ల: పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అసారా వైటూ న్యూ లైఫ్, ఆసరా చారిట్రబుల్ ట్రస్ట్, ది హెల్ప్‌టూ హో ఫ్లేస్ రవి పౌండేషన్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులతోపాటు షేక్ సైదాబి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. స్కూల్ ప్రిన్సిపల్ నరేష్ పాల్గొన్నారు.

■ పిడుగురాళ్ల ఎన్ఎంయూ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ జెండా వందన కార్యక్రమం నిర్వహించారు. మహిళా కండక్టర్లకు బహుమతులు ప్రదానం చేశారు. పద్మావతి, కుమారి, కోటేశ్వరి, నాగేశ్వరమ్మ, సీహెచ్ శ్రీలక్ష్మి, శ్రీదేవి, అరుణ, విజయలక్ష్మీ, డి.అరుణ, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: తుమ్మలచెరువు బోధి పాఠశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా వృద్ధులను సన్మానించారు. వారికి అన్నదానం చేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ కల్యాణ్ రామ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ సునీతారెడ్డి పాల్గొన్నారు.


చక్రధార్ కళాశాలలో మహిళలను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు


కేక్ కట్ చేస్తున్న మహిళలు


బోధి పాఠశాలలో వృద్ధులకు అన్నదానం


బహుమతులతో మహిళా కండక్టర్లు

పిడుగురాళ్ల: మహిళలు విద్యా వంతులు అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, హక్కుల సాధన కోసం రాజ్యాంగ బద్ధంగా పోరాడాలని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని లెనిన్ కార్డ్స్ స్కూల్‌లో జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన దయామణి, హెచ్ఎం లతను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

యాభై ఏళ్లకు పూర్వ విద్యార్థుల సమ్మేళం

పిడుగురాళ్ల: యాభై ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితుల ఆత్మీయ సమ్మేళం ఆదివారం నిర్వహిస్తున్నట్లు పట్టణానికి చెందిన సినీ యాక్టర్, విశ్రాంత జవాను, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్, పూర్వ విద్యార్థి మేక సురేష్ బాబు శనివారం తెలిపారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974–75లో పదోవ తరగతి విద్యార్థుల కలయిక జరుగనుందని


మేక సురేష్‌బాబు

తెలిపారు. అప్పటి బ్యాచ్‌లో 94 మందికి గాను ప్రస్తుతం 60 మంది ఉన్నారని తెలిపారు. స్నేహితులందరు తప్పనిసరిగా కుటుంబ సభ్యులతో కలిసి హాజరు కావాలని కోరారు.

దిగుబడి వస్తుందని మోసం చేశారు

రెంటచింతల: మంచి దిగుబడి ఇస్తుంది. అధిక ఆదాయం వస్తుంది అని ఐ.టి.సి కంపెనీకి చెందిన ఓ ప్రతినిధి నమ్మించి మోసం చేశాడని రెంటాల గ్రామానికి చెందిన నవులూరి పిచ్చిరెడ్డి శనివారం వ్యవసాయ, పోలీసు అధికారులకు వినతి పత్రాలను అందజేశాడు. అతని వివరాల మేరకు.. దుర్గి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన జక్కా కొండలు అనే వ్యక్తి ఐ.టి.సి కంపెనీ మొక్కజొన్న సీడ్‌ను తనకు సరఫరా చేశాడని చెప్పారు. ఎకరాకు సుమారు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, క్వింటా రూ.3,500 చొప్పున పంట తామే కొంటామని చెప్పాడని పేర్కొన్నారు. దీంతో తన 3.16 ఎకరాల్లో ఈ విత్తనాలతో పంటను సాగుచేశానని చెప్పారు. సాగు సమయంలో గ్యారెంటీ బాండ్ ఇస్తామని చెప్పి, ఇవ్వలేదని తెలిపారు. సుమారు 128 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 53 క్వింటాళ్ల మాత్రమే వచ్చిందని వివరించారు. దీంతో రూ.3 లక్షలకు పైగా నష్టపోయానని, నష్టపరిహారం చెల్లించే వరకు.. లోడ్ చేసిన లారీని అడ్డగించినట్లు పిచ్చిరెడ్డి తెలిపారు. ఐ.టి.సి కంపెనీతో మాట్లాడి న్యాయం చేయాలని అధికారులను కోరినట్లు వెల్లడించాడు.


రైతు అడ్డుకున్న లారీ

వక్తృత్వ పోటీల్లో విద్యార్థినికి ప్రథమ బహుమతి

రెంటచింతల: మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ నిర్వహించిన వక్తృత్వ పోటీలో స్థానిక ఫాతిమా విద్యా నికేతన్ స్కూల్ విద్యార్థిని ఎస్.అమృత వైశాలి ప్రథమ బహుమతి సాధించింది. శనివారం నర్సరావుపేట పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో జి.రమణకాంత్‌రెడ్డి చేతుల మీదుగా వైశాలి మెడల్, సర్టిఫికెట్ అందుకుంది. సోషల్ మీడియా ప్రభావం నుంచి ఎలా రక్షించుకోవాలి, ఆత్మరక్షణ ఎలా పొందాలి అనే ఐదు అంశాల్లో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, స్థానిక ఎస్ఐ సీహెచ్ నాగార్జున, హెచ్ఎం ఏరువ స్టెఫీస్టార్, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.


ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న అమృతవైశాలి

ఇస్సప్పాలెంలో ఎస్‌బీఐ శాఖ ప్రారంభం

నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్సప్పాలెంలో ఎస్‌బీఐ శాఖ శనివారం ప్రారంభమైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఎస్‌బీఐ 70 శాఖలు, 501 మహిళా సీఎస్‌పీ పాయింట్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ముఖ్యఅతిథులుగా వర్చువల్‌గా హాజరై నూతన శాఖలను ప్రారంభించారు. గుంటూరు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ డెప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణప్రభు, ఆర్‌బీఓ నరసరావుపేట రీజినల్ మేనేజర్ డి.రామ్‌కుమార్ పాల్గొని బ్రాంచ్ ప్రాంగణంలో ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులను సత్కరించారు. కార్యక్రమంలో ఇస్సప్పాలెం నూతన బ్రాంచ్ మేనేజర్ కె.ప్రతాప్, ప్రాంతీయ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీజీఎం కృష్ణప్రభు

పాఠశాలకు జాతీయ స్థాయిలో ఎల్లో రేటింగ్

రొంపిచర్ల: మండలంలో కొత్తపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నేషనల్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో భాగంగా జాతీయ స్థాయిలో స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించిందని ప్రధానోపాధ్యాయులు బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా తమ పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం జరుగుతుందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ నియమాల కనుగుణంగా అమలు చేస్తున్నామని అన్నారు. జాతీయ స్థాయిలో తమ స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించటం లో కో–ఆర్డినేటర్ గా ఉపాధ్యాయులు వై.మల్లికార్జునరావు వ్యవహరించారని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించటంపై ప్రధానోపాధ్యాయులు బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు మల్లికార్జునరావును ఎంఈఓలు హవేల, డి.బ్రహ్మేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జంగుల పెద్ద శేషయ్య అభినందించారు.

రక్తదానంలో స్వచ్ఛందంగా పాల్గొనాలి

నరసరావుపేట రూరల్: ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సతీమణి డాక్టర్ అదితి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ అదితి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రక్తం సకాలంలో అందకపోవడం వలన ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రక్తదాన శిబిరాల ద్వారా అరుదైన బ్లడ్ గ్రూపులు కలిగిన వారి వివరాలు సేకరించి అత్యవసర సమయాల్లో సంప్రదించడం జరుగుతుందని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరంలో సేకరించిన రక్తానికి అన్ని పరీక్షలు నిర్వహించి తలసేమియా, ఎనీమిక్, సికల్సెక్సెస్ వంటి వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా అందిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ శరత్‌బాబు, మేనేజింగ్ కమిటి సభ్యులు డాక్టర్ సృజనా, డాక్టర్ రెహమతుల్లా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అదితి

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల రెడ్డిపాలెం ఆంజనేయ స్వామి గుడి సమీపంలో శనివారం లారీలో ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. మినీ లారీలో ఈ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో దాడి చేసి పట్టుకున్నామన్నారు. లారీ, బియ్యంతో పాటు లారీ నడుపుతున్న వి.పి.కాశిరెడ్డిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. స్థానికులు నుంచి సేకరించిన వివరాలు.. గ్రామంలోని కొత్తూరు బొడ్రాయి సెంటర్ నివాసితులైన ముస్లిం కుటుంబాలకు చెందిన మహిళలు రోజు మాదిరిగానే మిరప తోటల్లో వ్యవసాయ కూలీ పనులు చేసుకునే నిమిత్తం శనివారం ఉదయం 6 గంటలకు ఆటోలో బయలు దేరారు. నాదెండ్ల మండలం తూబాడు గ్రామానికి వెళ్లేందుకు 16నంబర్ జాతీయ రహదారిపైకి రాగానే అండర్‌పాస్ హైవే వంతెన మీదుగా వేగంగా దూసుకువచ్చిన గుర్తు తెలియని వాహనం ఆటో వెనుక భాగంలో ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొడుతూ దూరంగా ఉన్న సర్వీసు డివైడర్ పక్కన ఏర్పాటు చేసిన ఐరన్ సేఫ్టీరాడ్లకు గుద్దుకుని ఆగిపోయింది. అయితే ఢీకొట్టిన వాహనం మాత్రం నిలుపుదల చేయకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న 14 మంది కూలీలతో పాటు ఆటో డ్రైవరకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులతో పాటు బాధితుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకున్నారు. నుజ్జునుజ్జయిన ఆటో, చిందరవందరగా గాయాలతో పడిఉన్న కూలీలు భయాందోళనకు గురై కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు బాధితులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలైన ఆరుగురిని జిల్లాకేంద్రం నరసరావుపేట కార్పొరేట్ ఆస్పత్రులకు, మరొకరిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వీరిలో జీజీహెచ్‌కు తరలించిన షేక్ రహంతుల్లాబి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అమీన్‌సాహెబ్ పాలెంలో కంటి వైద్య శిబిరం



నాదెండ్ల: అమీన్‌సాహెబ్ పాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం కాకాని శంకర కంటి వైద్య శాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బండ్లమూడి సీతారామయ్య, అఖిలాండమ్మ జ్ఞాపకార్థం వారి మనువడు పాటిబండ్ల శేఖర్‌బాబు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచి కామినేని లలితానాగేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్ శ్వేత, డాక్టర్ సాయి సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వీరిలో 30 మంది కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేసి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శనివారం 20 మందిని ఆస్పత్రి వాహనాల్లో ఆపరేషన్లకు తరలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గుర్రం ఉపేంద్ర, ప్రస్తుత ఉపసర్పంచి తేళ్ల రాజేష్, నాయకులు గుర్రం నాగపూర్ణచంద్రరావు, రామారావు పాల్గొన్నారు.